



# కరపత్రం

SINCE 2014

గురువారం నవంబర్ 21 2024 | సంపుటి :0 | సంచిక : 43 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# ప్రజలనే కాదు..వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారు: సీఎం రేవంత్



- అసెంబ్లీకి వచ్చే దమ్ముందా కెసిఆర్
- రుణమాఫీపై చర్చ చేద్దామా
- నీవెంత అభివృద్ధి చేశావో..నేనెంత చేశానో చర్చిద్దాం
- వేములవాడ రాజనన్ననూ మోసం చేసిన కెసిఆర్
- పదేళ్లలో చేయలేని పనులు చేస్తుంటే నొప్పెందుకు
- స్థానిక ఎన్నికల్లో మీ సంగతి మరోమారు చూస్తాం
- కెటిఆర్ ఎందాక ఎగురుతాడో చూస్తా
- రంగనాయక్ సాగర్ భూముల్లో హరీష్ రావు ఫామ్‌హౌజ్
- అందరి లెక్కలు తీస్తున్నాం...అవినీతికి పాల్పడ్డవారి భరతం పడతాం
- వేములవాడ విజయోత్సవ సభలో సిఎం రేవంత్ విమర్శలు

ప్రజలనే కాదు.. వేములవాడ రాజన్ననూ కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణమాఫీని అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా? మీరు చేసిన రుణమాఫీ.. మేము చేసిన రుణమాఫీ వివరాలు బయటకు తీసి చర్చకు పెడదాం. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రుణమాఫీ లెక్కలు తీసి చూపిస్తాం. పదేళ్లలో మీరు చేయలేని పని మేం చేస్తుంటే మీకు నొప్పి ఎందుకు? మీ నొప్పికి మా కార్యకర్తల దగ్గర మందు ఉంది.. త్వరలోనే పెడతారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ సంగతి తేలుస్తాం అంటూ సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణను దోచుకున్న కేసీఆర్‌ను గద్దె దించాలని సిరిసిల్ల పాదయాత్రలో నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వేములవాడ గుడిచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం రేవంత్ మాట్లాడారు. రూ.11వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేళ్లు తీసుకున్నారు. 25 రోజుల్లో 23 లక్షల కుటుంబాలకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాయిదా పడుతూ వస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 30న మరోసారి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడికి వచ్చి ప్రాజెక్టులపై సమీక్షిస్తారని సీఎం చెప్పారు. దేశానికి ప్రధానిని అందించిన గడ్డ కరీంనగర్. పరిపాలన ఎలా ఉంటుందో దేశానికి చూపిన తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అన్నారు. తెలంగాణ ఇస్తామని సోనియా గాంధీ ఇక్కడి నుంచే ప్రకటన చేశారు. తెలంగాణ బిల్లును ఆమోదింపజేయడంలో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత దూరమైనా వెళ్తుంది. పొన్నం ప్రభాకర్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించారు. బండి సంజయ్‌ను రెండుసార్లు పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్ర మంత్రి అయ్యారు కానీ, కరీంనగర్ జిల్లాకు కేంద్రం నుంచి చిల్లిగవ్వ అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం ఎప్పుడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా?అంతకు ముందు 3 సార్లు భారాస ఎంపీలను గెలిపిస్తే వాళ్లు కూడా కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని ఏ రాష్ట్రం కూడా అధికారంలోకి వచ్చిన పది నెల్లోనే 50వేల ఉద్యోగాలు ఇవ్వలేదు.

తరువాయి పేజి 2లో


## హైబ్రిడ్ వాహనాలకూ పన్ను రాయితీ యోచన!

### దిల్లీ లాంటి పరిస్థితి తెలంగాణలో రావద్దు: మంత్రి పొన్నం



హైదరాబాద్: విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసేవారికి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులపై 100 శాతం మినహాయింపును సోమవారం నుంచి అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. వాహన కాలుష్యం నియంత్రణకు మరో కీలక నిర్ణయం తీసుకోవడంపైనా దృష్టి సారించింది. హైబ్రిడ్ వాహనాల కొనుగోలుపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్‌పై పన్ను రాయితీ ఇవ్వాలని యోచిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. 'బ్యాటరీ/పెట్రోల్ లేదా బ్యాటరీ/డీజిల్ కాంబినేషన్‌లో హైబ్రిడ్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వీటికి రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులపై 100 రాయితీ ఇవ్వాలని రవాణా శాఖ యోచిస్తోంది. తీవ్ర వాయు కాలుష్యంతో దిల్లీలో పాఠశాలల్ని బంద్ చేసే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ మహానగరంలో, తెలంగాణలో దిల్లీ వంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. రాష్ట్రంలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలంటే 15 ఏళ్లు దాటిన వాహనాల్ని ప్రజలు స్వచ్ఛందంగా స్క్రాప్ చేయాలి. కొత్త వాహనాలు కొనేవారు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ)నే కొనుగోలు చేయాలి' అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## పట్నం నరేందర్‌రెడ్డిని ఎందుకలా అరెస్టు చేశారు?: హైకోర్టు



హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు విధానాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుపట్టింది. కేబీఆర్ పార్కు వద్ద వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించింది. మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలాగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని నిలదీసింది. నరేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారా అని పీపీని ప్రశ్నించింది. దాడికి గురైన అధికారుల గాయాలపై సరిగ్గా నివేదించలేదని హైకోర్టు పేర్కొంది. తీవ్రగాయాలైనట్లు రిపోర్టు ఇచ్చి.. చిన్న గాయాలైనట్లు రాశారని చెప్పింది. నరేందర్‌రెడ్డి అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలు పాటించలేదని ఉన్నత న్యాయస్థానం ఆక్షేపించింది.

2లో

## సిరిసిల్ల జిల్లాపై సీఎం వరాల జల్లు

### పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

రాజన్న సిరిసిల్ల జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. జిల్లాలో పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, భూమి పూజలు చేసారు. ప్రజాపాలన తొలి ఏడాదిలోనే మొత్తం రూ.694.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టారు. రూ. 76 కోట్లతో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంఖుస్థాపన చేసారు.

తరువాయి పేజి 2లో

## అభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్ఎస్

- లగచర్లలో అధికారులపై దాడులు
- భూసేకరణ లేకుండా అభివృద్ధి అసాధ్యం
- భూసేకరణ కుట్రలో కెటిఆర్ ఊచలు లెక్కించాల్సిందే
- వేములవాడ సభలో సిఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణలో సంచలనం సృష్టించిన వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అభివృద్ధికి అడ్డుపడుతోందని.. లగచర్లలో కొందరిని ఉసిగొల్పి కలెక్టర్, అధికారులపై దాడులు చేయించాని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డి కూడా మొలవని భూమిలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

తరువాయి పేజి 2లో

## కేసీఆర్ కలుపు మొక్క కాదు కల్పవృక్షం : హరీశ్‌రావు

- వరంగల్ మీటింగ్‌లో తిట్ల పురాణం తప్ప ప్రజలకు, మహిళలకు పనికొచ్చే ఒక మాట కూడా సీఎం రేవంత్ రెడ్డి చెప్పలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- కేసీఆర్ కలుపు మొక్క కాదు కల్పవృక్షం అని స్పష్టం చేశారు.
- కురుమూర్తి దైవదర్శనం అనంతరం మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు.



2లో

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు



హైదరాబాద్ : బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.

2లో

## ఫార్మా కంపెనీలో ప్రమాదం.. ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు



జీడిమెట్ల: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని అరోరా ఫార్మా కంపెనీ రియాక్టర్‌లో రసాయన ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కార్మికుడు అనిల్(40) మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు గోపి(23), శ్రీనివాస్(25), బలరామ్(30)నకు తీవ్ర గాయాలయ్యాయి బాయిలర్ శుభ్రం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఉదయం జరిగితే.. మృతుడి, బాధితుల కుటుంబాలకు సంస్థ నిర్వాహకులు సమాచారం ఇవ్వలేదు. సంస్థ ముందు మృతుడి బంధువులు నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం నవంబర్ 21 2024

## హస్తినలో తెలుగు నేతల హల్‌చల్

‘తెలుగుదేశం కేంద్రంలో కీలక పాత్ర పోషించడం ఇది మొదటిసారి కాదు. 1989లో ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించాం. 1996%-%1998 మధ్యలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత ఆరున్నర సంవత్సరాలు వాజపేయి ప్రభుత్వంలోనూ తెలుగుదేశం ప్రధాన భూమిక నిర్వహించింది. పార్లమెంట్‌లో ఒకప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం. ఆ సమయంలో బీజేపీకి రెండు సీట్లు లభిస్తే తెలుగుదేశంకు 35 సీట్లు లభించాయి’ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వారం హిందూస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిజంగా అవి దేశ రాజధానిలో తెలుగువారికి సంబంధించి బంగారు రోజులు. తొలుత ఎన్టీఆర్‌ను, తర్వాత చంద్రబాబునాయుడును కలుసుకునేందుకు జాతీయ స్థాయి నేతలు ఆసక్తి ప్రదర్శించిన రోజులవి. యునైటెడ్ ఫ్రంట్ రోజుల్లో చంద్రబాబునాయుడు బస చేసే ఏపీభవన్ ఫ్రంట్ ప్రధాన కార్యాలయంలా ఉండేది. వాజపేయి కూడా అనేక కీలక అంశాలపై ఆయనతో చర్చించేవారు. తరుచూ రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకేకాక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకోసం చంద్రబాబు తరుచూ వచ్చి సుడిగాలిలా కేంద్ర మంత్రులను కలిసేవారు. ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్లు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేవి. ఎన్నోసార్లు ఆయన జాతీయ స్థాయిలో జరిగిన మీడియా సదస్సుల్లో పాల్గొనేవారు.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మరోసారి తెలుగుదేశం పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఏర్పడింది. హిందుస్థాన్ టైమ్స్ మాత్రమే కాదు, మరో జాతీయ పత్రిక ‘ఇండియా టుడే’ కూడా దేశంలో అత్యంత శక్తిమంతులైన పది మంది నాయకుల్లో ఒకరుగా చంద్రబాబును గుర్తించింది. తెలుగుదేశంకు చెందిన 16 మంది ఎంపీలు లేకపోతే మోదీ ప్రభుత్వం మెజారిటీకి చేరువలోకి వచ్చేది కాదని ఇండియా టుడే పేర్కొంది. దేశంలో అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు బూడిదలోంచి పునరుత్థానమయ్యే ఫీనిక్స్ పక్షిలా మళ్లీ జాతీయ స్థాయిలో ప్రత్యక్షమయ్యారని ఆ పత్రిక ప్రశంసించింది. ఆయన హయాంలో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆయన కలలు కంటున్న స్వర్ణాంధ్రప్రదేశ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది.

చంద్రబాబునాయుడు మాదిరి ఢిల్లీలో చర్చకు వచ్చిన తెలుగు రాష్ట్రాల అధినేతలు తక్కువే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 33 మంది ఎంపీలు రాష్ట్రం నుంచి గెలిచినప్పటికీ ఆయన రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యేవారు. జాతీయ సదస్సుల్లో ఆయన ఏనాడూ పాల్గొనలేదు. యూపీఏ హయాంలో భాగస్వామిగా ఉన్న కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ ఏనాడూ జాతీయ స్థాయిలో తన ముద్ర వేసేందుకు ప్రయత్నించలేదు. కేంద్రమంత్రిగా ఆయన తన మంత్రిత్వశాఖకు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఆ విషయం పార్లమెంట్‌లో కూడా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఆయన ఢిల్లీ వచ్చి జాతీయ మీడియాతో మాట్లాడిన సందర్భాలు అతి తక్కువ. ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడినప్పుడు, పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పుడు కూడా జాతీయ మీడియా అంతగా చర్చించలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కేసీఆర్ రోజుల తరబడి తుగ్లక్ రోడ్ నివాసంలో ఉన్నప్పటికీ ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. నిజానికి తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన శక్తి ఉన్నప్పటికీ ఢిల్లీలో మీడియాతో ఎందుకు మాట్లాడడం లేదని నేను ఒకసారి అడిగితే ఆయన ఆ అవసరం లేదని కొట్టిపారేశారు. 22 మంది ఎంపీలు ఉన్నప్పటికీ వైసీపీ అధినేత జగన్ కూడా కేసీఆర్ మాదిరి కూపస్తమండూకంలా వ్యవహరించారు. ఏపీలో అభివృద్ధి గురించి మాట్లాడేందుకు కానీ, పెట్టుబడులను ఆహ్వానించేందుకు కానీ ఆయన ఏనాడూ ప్రయత్నించలేదు. వ్యక్తిగత ప్రయోజనాలకోసం, కేసుల కోసం మాత్రమే ఆయన నరేంద్రమోదీ, అమిత్ షాలను కలుసుకునేందుకు వచ్చేవారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న విజయసాయిరెడ్డి మోదీ దృష్టిలో పడేందుకు మాత్రమే తాపత్రయపడేవారు. మిగతా ఎంపీలు కూడా అస్తిత్వం లేనట్లే ఉండేవారు. పోనీ గత అయిదేళ్లలో ఏ-1, ఏ-2లపై ఉన్న కేసుల్లో ఒక్క సెక్షన్ అయినా తగ్గించుకోగలిగారా అంటే అదీ లేదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తెలుగు రాష్ట్రాల్లో మరో ముఖ్యమైన నేతగా గుర్తింపు పొందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కూడా ఢిల్లీలో రాజకీయ వర్గాలు, మీడియా ఆసక్తి ప్రదర్శించడం. కేసీఆర్‌ను ఓడించడంలో రెండుసార్లు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు విఫలమైన తర్వాత రేవంత్‌రెడ్డి వెలుగులోకి రాగలిగారు. అనతి కాలంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన వృద్ధనేతలు తమ స్వంత రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేలేక చతికిలపడ్డ సమయంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి ఆ పార్టీకి భవిష్యత్తుపై ఆశ కల్పించారు. బీజేపీ 240 సీట్లు దాటదని సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా టీవీ రజత్ శర్మ షోలో ప్రకటించిన తర్వాత జాతీయ మీడియా దృష్టిలో పడ్డారు. రేవంత్ హిందీ, ఇంగ్లీషుల్లో అనర్గళంగా మాట్లాడుతూ ఎదురు దాడులు చేయగలగడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనను మహారాష్ట్రలో స్టార్ కాంపైనర్‌గా కూడా మొహరించింది. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో పథకాలను అమలు చేయడం లేదన్న మోదీ ఆరోపణలను ఆయన తిప్పికొట్టడమే కాక, మహారాష్ట్రకు రావల్సిన ప్రాజెక్టులను గుజరాత్ తరలించుకుపోవడాన్ని ఎత్తి చూపి బీజేపీ ఆగ్రహానికి గురయ్యారు. కాంగ్రెస్ రాజకీయాల్లో జాతీయ స్థాయిలో భవిష్యత్తు ఉన్న నేతల్లో ఒకరుగా ఆయన ఇప్పటికే గుర్తింపు పొందారు.

ఈ రీత్యా ఢిల్లీలో చాలా కాలం తర్వాత తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఒకరు ఎన్డీఏలోనూ, మరొకరు కాంగ్రెస్‌లోనూ కీలకపాత్ర పోషిస్తుండడం గమనార్హం. కాని ఢిల్లీలో ఎంతగా గుర్తింపు పొందినప్పటికీ చంద్రబాబుతో పోలిస్తే రేవంత్‌కు ఉన్న అవరోధాలు ఎన్నో. ఇది ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీకీ ఉన్న తేడా లాంటిది. చంద్రబాబు మాదిరి రేవంత్ ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం లేదు. అంతేకాక చంద్రబాబు ఒక ప్రాంతీయ పార్టీ అధినేత. పూర్తి పార్టీ ఆయన పట్టులో ఉంటుంది. వైసీపీలో ఎవరైనా విమర్శించినా, ఆఖరుకు సోషల్ మీడియాలో దుమ్మెత్తి పోసినా అందుకు బలమైన జవాబు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. చంద్రబాబు తనకు కావల్సిన టీమ్‌ను ఏర్పర్చుకోగలరు. అధికార యంత్రాంగంపై పట్టుబిగించగలిగిన శక్తి ఆయనకు ఉన్నది. కాంగ్రెస్ అనే ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో రేవంత్ ఉన్నారు. కనుక రాష్ట్ర పార్టీపై ఆయన పట్టు అంతగా బిగించలేకపోతున్నారు. రేవంత్‌ను ఎవరైనా విమర్శిస్తే అంతే స్థాయిలో విరుచుకుపడే సీనియర్ నేతలు పెద్దగా లేరు. అంతేకాక ప్రత్యర్థులు విమర్శిస్తుంటే అందుకు ఒకటి రెండు విమర్శలు జోడించి ఢిల్లీకి చేరవేసేవారు ఎక్కువగా ఉంటారు. అధికారులను, టీమ్‌ను ఎంచుకోవడంలో కూడా చంద్రబాబుకున్న సౌలభ్యం ఆయనకు లేదు. ఏది ఎక్కడి నుంచి లీక్ అవుతున్నదో కూడా చెప్పడం కష్టం. అయినప్పటికీ తనకున్న పరిమితులను అధిగమించేందుకు ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. ‘కాంగ్రెస్ ప్రస్తుత ఫార్మాట్‌ను మార్చాల్సిన అవసరం ఉన్నది. ట్వంటీ ఓవర్ల మాచ్‌లో ఆడాల్సినట్లు ఆడే బదులు ఇంకా టెస్ట్ మ్యాచ్ మాదిరి ఆడుతున్నాం’ అని కాంగ్రెస్ పార్టీలో ఉన్న లోపాల గురించి ఎక్స్‌ప్రెస్ అడ్డా షోలో ధైర్యంగా చెప్పగలగడం రేవంత్‌కే సాధ్యమైంది.

చంద్రబాబు, రేవంత్‌ల తర్వాత ఢిల్లీలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రవేశించి రంగంలోకి దిగడం మరో ఆసక్తికరమైన పరిణామం. అమృత్ టెండర్లు, లగచర్ల ఘటనల గురించి ఆయన గత వారం రోజుల్లో రెండుసార్లు ఢిల్లీలో జాతీయ మీడియాలో మాట్లాడారు. ఆశ్చర్యకరంగా కేటీఆర్‌కు జాతీయ మీడియా కీలక ప్రాధాన్యత నిచ్చింది. కనీసం డజన్ ఛానళ్లు ఆయనతో ముఖాముఖి ఇంటర్వ్యూలు చేశాయి. ఆయన కూడా ఇంగ్లీషు, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరు. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో ఆయన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలను విమర్శించడం, అదే సమయంలో రాష్ట్ర బీజేపీ నేతలు కూడా లగచర్ల ఘటనపై విరుచుకుపడడం యాదృచ్ఛికం కాదు. నిజానికి కేసీఆర్ హయాంలో కూడా మల్లన్నసాగర్ వంటి ఘటనలు జరిగినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీలో పెద్దగా మాట్లాడలేదు సరికదా, జాతీయ మీడియాలో సైతం చర్చకు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్రతిష్టపాలు కావడం, తమ పుట్టల్లో పాములేమున్నాయా అని రేవంత్‌రెడ్డి సర్కార్ త్రవ్వే యత్నం చేయడంతో బీఆర్ఎస్ జీవన్మరణ సమస్యలో పడింది. అందువల్ల కేటీఆర్ ఢిల్లీలో ప్రవేశించి ఊరూవాడ ఏకం చేసి మద్దతు కోసం ప్రయత్నించడంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ కంటే ఎక్కువగా సోషల్ మీడియాపై కేటీఆర్ పట్టు బిగించినట్లు స్పష్టమవుతోంది. గత రెండు నెలలుగా కేసీఆర్ ఏమి చేస్తున్నారో తెలియకపోవడంతో పార్టీ పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది.

ఎడిటర్
ఆర్ చైతన్య

## నాకు తెలుసు.. మీరు చాలా ఫేమస్:

మొదటిపేజీ తరువాయి

అసలేం జరిగిందంటే.. జీ20 సదస్సులో భాగంగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోను ప్రధాని మోదీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జైశంకర్ సైతం ఆయనకు కరచాలనం చేస్తూ.. తనని తాను పరిచయం చేసుకున్నారు. ఈక్రమంలోనే ‘మీరు నాకు తెలుసు. మీరు చాలా ఫేమస్’ అంటూ సుబియాంటో జైశంకర్‌ను ప్రశంసించారు. దీంతో ప్రధాని మోదీ వారి వైపు చూసి నవ్వులు చిందించారు.

వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై మోదీ, సుబియాంటో చర్చలు జరిపారు. ఇండోనేషియా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇరువురు నేతలు భేటీ కావడం ఇదే తొలిసారి.

## దిల్లీ కాలుష్యం ఎఫెక్ట్.. 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్

కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటి నుంచే పని



చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ పేర్కొన్నారు.

దిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. గాలి నాణ్యతా సూచీ 400లకు పైగా నమోదవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. కాలుష్య తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ ప్రకటించారు.

దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి దిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులోభాగంగా 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. దీని అమలుకోసం నేడు(బుధవారం) సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నాం” అని దిల్లీ పర్యావరణశాఖ మంత్రి గోపాల్‌రాయ్ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దిల్లీలోని మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయాలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

దిల్లీలో వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. ఈ ఉదయం గాలి నాణ్యత సూచీ 422గా నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్‌ను దాటడంతో వాతావరణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలుష్యం నేపథ్యంలో సుప్రీంకోర్టులోని ఏ కేసులైనా సరే లాయర్లు వర్చువల్ మోడ్‌లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు కృత్రిమ వర్షం కురిపించేలా చర్యలు తీసుకోవాలని దిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ తాజాగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మద్నూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సౌజన్య అందరికి ఆదర్శం - మంత్రి కోటిమరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ నవంబర్ 20 జన తెలంగాణ.



పరీక్షలో పాసై మద్నూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయిన అయిల్వార్ సౌజన్య రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ రోజు మంత్రుల నివాస సముదాయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తో కలిసి కామారెడ్డి జిల్లా, మద్నూర్ మార్కెట్ ఛైర్మన్ ఎన్నికైన సందర్భంగా.. మంత్రిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న అయిల్వార్ సౌజన్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. రాజకీయాల్లో ఎక్కడో ఒకచోట మార్పు మొదలు కావాలని.. అది సౌజన్య నుంచే మొదలైందని.. అందరు ఈ విధానాన్ని పాటిస్తే ప్రజలకు జవాబుదారిగా ఉండొచ్చని ఆయన అన్నారు.

సాధారణంగా రాష్ట్రంలో ఏ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్నిక అయినా.. స్థానిక ఎమ్మెల్యేనో, మంత్రో సిఫారసు చేస్తారని.. కానీ, పరీక్షలు నిర్వహించి ప్రతిభ కలిగినవాళ్లు, చదువుకున్నవాళ్లు ఛైర్మన్ కావాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మంచి ప్రయత్నం చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. మూడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముగ్గురు సీనియర్ లీడర్లతో కలిపి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్నికకు కమిటీ వేసి, ప్రశ్నపత్రం రూపొందించి.. అందులో ఎక్కువ మార్కులు వచ్చిన టాపర్ ని ఛైర్మన్ చేయడం సహసోపేతమైన నిర్ణయమని, ఇది సమకాలిన రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావంవ్యక్తం చేశారు. ప్రతీ ఎమ్మెల్యే ఇదే విధంగా ప్రయత్నిస్తే.. రైతులకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

అంతేకాదు, గ్రామంలో, పంచాయితీ నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామంలో నలుగురు వాలంటీర్లతో ఒక పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి నిధులు పక్కదారి పట్టకుండా మంచి ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొనియాడారు. రాజకీయాల్లో పారదర్శకత, జవాబుదారితనం లేకపోవడంతో దేశం వెనకబాటుకు గురవుతుందని, విద్య పెరిగిన ఈ రోజుల్లో ఇటువంటి ప్రయత్నాలు కారు చీకటిలో వెలుగుదివ్వెలుగా సమాజానికి మంచి సందేశం ఇస్తాయని ఆయన ప్రశంసించారు. డబ్బు ప్రమేయం పెరిగిపోయిందని రాజకీయాలకు దూరంగా ఉంటున్న యువతకు రాజకీయాల పట్ల ఒక నమ్మకాన్ని కలిగిస్తాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంతోషంవ్యక్తం చేశారు.

## కడప స్టీల్‌ప్లాంట్ కోసం ఎంపీ అవినాష్ ఏం చేశారు?: షర్మిల

మొదటిపేజీ తరువాయి

కడప: కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. గత ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్ కోసం జగన్ చేసిందేమీ లేదన్నారు. కేవలం టెంకాయలు కొట్టే ఫ్యాక్టరీగానే గత పాలకులు తయారు చేశారన్నారు. మీడియా ఎదుట షర్మిల టెంకాయలు కొట్టి నిరసన తెలిపారు. “కడప స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలకే పరిమితమైంది. చెల్లి పెళ్లి చేయాలి మళ్లీ మళ్లీ అన్నట్లుగా తయారైంది. పేద ప్రజల కోసం, కడప ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్సార్ చిత్తశుద్ధితో దీన్ని తీసుకొచ్చారు. 10వేల ఎకరాల్లో రూ.20వేల కోట్ల పెట్టుబడితో 20 మిలియన్ల టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది ఆయన ఆశయం. దీని ద్వారా 25వేల మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశముంది. వైఎస్సార్ చనిపోయిన తర్వాత వచ్చిన నాయకులందరూ స్టీల్ ప్లాంట్ ఊసే లేకుండా చేశారు. సెయిల్ ద్వారానే ప్లాంట్ నిర్మించాలని విభజన హామీల్లో ఉంది. 2014లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే నిర్మాణం జరిగి ఉండేది. ఏపీ పట్ల భాజపాకు చిన్నచూపు ఉంది. ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన హామీలను సైతం ఆ పార్టీ తుంగలో తొక్కింది.

**జగన్ ఆస్కార్ డైలాగులు చెప్పారు**

2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కూడా స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని విస్మరించారు. మూడేళ్లలో నిర్మాణం చేపట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటానని జగన్ నాడు ఆస్కార్ డైలాగులు చెప్పారు. అధికారం, ప్రాంతాలు, కంపెనీలు మారుతున్నా స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. పదేళ్లు ఎంపీగా ఉన్న వైఎస్ అవినాష్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్ కోసం పార్లమెంటులో ఏం చేశారో సమాధానం చెప్పాలి. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్లని జగన్‌కు ఎమ్మెల్యే పదవి ఎందుకో?ప్రతిపక్ష హోదాకు అవసరమైన ఎమ్మెల్యేలని గెలిపించుకోలేని ఆయన.. ప్రతిపక్ష హోదా కావాలని అడగటం సిగ్గుచేటు. కడప ప్రాంత అభివృద్ధికి స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమబాట పడుతుంది. అవసరమైతే నిరవధిక నిరాహార దీక్షకూ సిద్ధం” అని షర్మిల అన్నారు.

## వైకాపా ప్రతిపాదనల కారణంగానే ట్రూఅప్ ఛార్జీల వసూలు: మంత్రి గొట్టిపాటి

మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై పెను భారం వేసిందన్నారు. గత ప్రభుత్వం ఈఆర్సీకి పంపిన ప్రతిపాదనల వల్లే ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయాల్సి వస్తుందని మంత్రి వివరణ ఇచ్చారు. ట్రూ అప్ ఛార్జీలు వసూలుకు గత వైకాపా ప్రభుత్వమే కారణమన్నారు. ట్రూఅప్ ఛార్జీలపై శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు..

## నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా?.. గుంటూరు మేయర్‌పై హైకోర్టు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. “నగర ప్రథమ పౌరుడు మాట్లాడేది ఇలాగేనా? అసభ్య పదజాలంతో దాడి చేస్తారా? అసభ్య భాష వాడే వారు ఏ పార్టీవారైనా శిక్షించాల్సిందే. సేవ ద్వారా ప్రజలకు దగ్గరవ్వాలి.. అసభ్య భాషతో కాదు. బాధ్యతగా మెలగాలని గుంటూరు మేయర్‌కు చెప్పండి” అని ఆయన తరఫు న్యాయవాదికి హైకోర్టు సూచించింది. మనోహర్ నాయుడుకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది.“తెదేపా జాతీయ అధ్యక్షుడు, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు అక్రమ అరెస్టుని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న మాపై మేయర్, అనుచరులు తీవ్రంగా దూషించి పోలీసు లాఠీతో దాడి చేశారు. జనసేన అధినేత పవన్, నారా లోకేశ్‌ను దూషించి.. అవమాన పరిచేలా మనోహర్ నాయుడు మాట్లాడారు..” అని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు గుంటూరు అరండల్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా మేయర్, ఆయన అనుచరులపై పోలీసులు ఈనెల 16న కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టి వేయాలని మనోహర్ నాయుడు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

## ఉద్దేశ పూర్వకంగానే ఎంఎన్‌సీ మద్యం కంపెనీలను తరిమేశారు: మంత్రి కొల్లు రవీంద్ర

మొదటిపేజీ తరువాయి

“నాసిరకం మద్యం తాగి అనేకమంది అనారోగ్యం పాలయ్యారు. నాసిరకం మద్యంతో కిడ్నీ, కాలేయం సంబంధిత జబ్బులు పెరిగాయి. మద్యం తయారు చేసే 26 కొత్త కంపెనీలు తీసుకొచ్చారు. మద్యం విషయంలో వైకాపా పాలకులు వ్యవస్థీకృత దోపిడీ చేశారు. ఆన్‌లైన్ పేమెంట్స్ లేకుండా వ్యవస్థను నాశనం చేశారు. పరిపాలన చేతకాక ఆఖరికి బాండ్లు కూడా తాకట్టు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చాం. ఆరు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి మద్యం పాలసీ తెచ్చాం. మేం వచ్చాక మద్యం విషయంలో పారదర్శకంగా పని చేశాం. దుకాణాల దరఖాస్తు ఫీజు కిందే రూ.1,800 కోట్లు వచ్చింది. 12 ప్రీమియం మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని సబ్‌కమిటీ సిఫార్సు చేసింది. రూ.99కే నాణ్యమైన మద్యం ఇస్తున్నాం. పలు చోట్లు డీఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం” అని కొల్లు రవీంద్ర తెలిపారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలు: మంత్రి నిమ్మల

మొదటిపేజీ తరువాయి

**ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు.**

అమరావతి: ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలో బుడమేరు వాగుకు వచ్చిన వరదలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ పూర్తిచేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని మంత్రి నిమ్మల తెలిపారు. గత ఐదేళ్లలో బుడమేరు డైవర్షన్ కెనాల్ పనుల పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఒకేసారి 15 వేల క్యూసెక్కుల నీరు రావడంతో గండ్లు పడి వరదలు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని, భవిష్యత్తులో వరదలు రాకుండా ఆపరేషన్ బుడమేరు చేపడతామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

అదేవిధంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో పురపాలక శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఘాట్ల నిర్మాణాన్ని జలవనరుల శాఖ తీసుకుంటుందని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ప్రతిరోజూ గోదావరి హారతి నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. అయితే గత ఐదేళ్లలో గోదావరి హారతిని నిలిపివేశారన్న మంత్రి.. ప్రజల సంస్కృతి, సంప్రదాయాలపై కూడా వైకాపా ప్రభుత్వం దాడి చేసిందన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం నవంబర్ 21 2024

## బొల్లారంలో రోడ్డు నిర్మాణ పనుల్లో లో నిర్లక్ష్యం



– మున్సిపల్ కమిషనర్ రోడ్డు పనులు నా దృష్టిలో లేవు అనడం హాస్యాస్పదం
– నిలదీసిన ప్రముఖ సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం ప్రధాన రహదారి హనుమాన్ టెంపుల్ దగ్గర రోడ్డు తవ్వి సుమారు 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికీ బొల్లారం కమీషనర్ తన దృష్టిలో లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఆ రోడ్డు బొల్లారం ప్రధాన రహదారి అలాంటి రోడ్డు తవ్వి వదిలేసారు. ఈదారి మీదుగా కొన్ని వేల మంది ప్రయాణాలు సాగిస్తారు అని తెలిసి కూడా రోడ్డు నిర్మాణం గురించి బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారుని ఫోన్ లో సంప్రదించగా ఆమె ఆ రోడ్డు నిర్మాణం గురించి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆనంద్ కృష్ణారెడ్డి ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనులు గురించి కమీషనర్ కు సరైన అవగాహన లేకపోవడం నిజంగా దురదృష్టకరం. అధికారులు మొద్దు నిద్ర పోతున్నారు అని అనడానికి సాక్ష్యం గా ఈ రోడ్డు నిర్మాణం సజీవ సాక్ష్యం. ఇప్పటికైనా కమీషనర్, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తక్షణమే రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో అధికారుల నిర్లక్ష్య తీరుపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బొల్లారం బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఏసిపి... శ్రీనివాస్ జి..

– సీఎం సభకు హుజురాబాద్ నుండి వెళ్తున్నారని...

**కరపత్రం శంకరపట్నం నవంబర్ 20**



తెలంగాణ ముఖ్యమంత్రి ఇనుముల రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు దక్షిణ కాశి వేములవాడ దర్శనం వస్తున్నట్లు సమాచారం ఉండడంతో హుజురాబాద్ నుండి దళిత బంధు అమలు కోసం దళితులు తర్లుతున్నారని, అనుమానంతో హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ జాతీయ రహదారిపై వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. గత కొన్ని రోజుల క్రితం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో దళిత బంధు అర్హులకు రెండో విడత అందజేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా రాస్తారోకో నిర్వహించారు. వేములవాడకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యట నియమధ్యంలో హుజురాబాద్ నుండి వాహనాల్లో దళిత బంధు లబ్ధిదారులు దళిత సంఘాల నాయకులు తర్లుతున్నారని అనుమానంతో సీఎం సభను విజయవంతం చేయుటకు ముందస్తు చర్యల్లో భాగంగా ఏసిపి ఆధ్వర్యంలో వాహనాలను తనకి ఇచ్చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ రూరల్ సిఐ పులి వెంకట్, హుజురాబాద్ టౌన్ సిఐ తిరుమల్ గౌడ్, కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి, సైదాపూర్ ఎస్సై తిరుపతి, పోలీస్ లు తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

వీణవంక ఎస్సై తోట తిరుపతి..



**కరపత్రం ప్రతినిధి,వీణవంక, నవంబర్ 20.**
వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామ శివారులో బుధవారం ఉదయం 8 గంటలకు వీణవంక పోలీసులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని, ఓనర్ ఎలుకపెల్లి రాజయ్య, డ్రైవర్ ఎలుకపెల్లి సాయి గణేష్ లను పోలీస్ స్టేషన్ కు తరలించి, వారి ఇరువురి పై కేసు నమోదు చేయడం జరిగిందని, వీణవంక ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

## రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ వెన్నెల గారికి అభినందనలు.



ప్రత్యేక అభినందనలు తెలిపిన. మహేష్. భరత్ పోల

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ గా గద్దర్ కూతురు డాక్టర్ గుమ్మడి వెన్నెల ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు యువజన, సాంస్కృతికశాఖ శనివారం ఉత్తర్వులు జారి చేసారు. గుమ్మడి వెన్నెల గారి స్వగ్రామం లో ఉంటున్నా మహేష్ పోల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ & భరత్ పోల మ్యూజిక్ టీచర్ కలిసి ప్రత్యేక అభినందనాలు తెలిపారు.

## గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ...

- 5 లక్షల ఎక్స్గ్రేషియా అందజేత...
- సీఎం చేతుల మీదుగా దక్షిణ కాశి వేములవాడలో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేత..
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన సీఎం....
- ఎమ్మెల్యే సత్యనారాయణ...



**కరపత్రం శంకరపట్నం నవంబర్ 20**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గము గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉందని మానకొండూర్ శాసనసభ్యుడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం సత్యనారాయణ మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర సహచర మంత్రులకు ఘన స్వాగతం ఎలిప్యాడ్ పలికినట్లు చెప్పారు. తెలంగాణ దక్షిణ కాశీగా పేరుందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, సహచర సహచర మంత్రులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ఆది శ్రీనివాస్, విప్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి జిల్లాకు చెందిన శాసనసభ్యుల, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు భూమి పూజ ప్రారంభోత్సవాలు చేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో గత ప్రభుత్వము చేయలేని గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు గల్ఫ్ లో జీవనోపాధి కోసం వలస బాట పట్టిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా పథకాన్ని దక్షిణ కాశీ వేములవాడ స్వామి దర్శనానంతరం 17 కుటుంబాలకు 85 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సహచర మంత్రు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేసినట్లు సత్యనారాయణ చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ బాధితుల పక్షాన గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధి లక్ష్యంగా మిడ్ మానేరు అభివృద్ధి కోసం వందల కోట్ల రూపాయల నిధులు, మిడ్ మానేరు నిర్వాసితులకు ఇందిరమ్మ గృహాల మంజూరు, భక్తుల సౌకర్యార్థం వేములవాడలో నూతన డిపో నిర్మాణం కోసం, మూల వాగు అభివృద్ధి కోసం, మెడికల్ కాలేజీ, ఇతర అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, భూమి పూజ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఇతర శాఖల మంత్రులు, పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం విప్ లు ఆది శ్రీనివాస్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జులు, జిల్లా అధికారులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25 న హైద్రాబాద్ లో జరిగే బీసీల సమర భేరి విజయవంతం చేయండి.

**కరపత్రం ప్రతినిధి నవంబర్ 20**
**– బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్.**
**– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మాజీ రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ఈనెల 25 న జరిగే బీసీల సమర భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.**



కరీంనగర్:– బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రెస్ క్లబ్లో జరిగిన పత్రికా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, రక్షక దళం చైర్మన్ ఉదయ్, సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ ఈ నెల 25 న జరిగే బీసీల సమర భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరీంనగర్ ప్రెస్ భవన్ లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం వెంకటేష్ మాట్లాడుతూ బీసీ లలో అత్యంత వెనుకడిన కులాలు ఎన్నో ఉన్నాయి అన్నారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో 2650 పైచిలుకు బీసీ కులాలు ఉంటే ఇప్పటి వరకు కూడా పార్లమెంట్,అసెంబ్లీ మెట్లెక్కనీ కులాలు దాదాపుగా 2400 పైచిలుకు కులాలు ఉన్నాయిఅన్నారు.దేశంలో 56%పైగా ఉన్నటువంటి బీసీలకు పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే ఈ వెనుక బడిన కులాలు పార్లమెంట్, అసెంబ్లీ లో అడుగు పెట్టే అవకాశం ఉందన్నారు.కేంద్రంలో బీసీల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కుల గణనలో జన గణన చేపట్టాలని,బీసీలకు క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎవరికి లేని క్రిమిలేయర్ విధానాన్ని ఒక్క బీసీ ఉద్యోగులకే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసం అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం బీసీ ల ప్రధానమైన డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల నాటికి బీజేపీకి బీసీ ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదు అన్నారు.ఈనెల 25 వ తేదీన జరిగే బీసీల సమర భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిగుర్ల శ్రీనివాస్,బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎడ్ల ఉమామహేశ్వర్ ను ఈ సందర్భంగా సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సందబోయిన ప్రసాద్, పయ్యావుల మహేష్, బెల్లం నరేందర్, గాలి రమేష్ యాదవ్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్లగోని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవరు లత, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మహాదేవుని భార్గవి, మహిళ నగర అధ్యక్షురాలు సంద్ర సరిత మహిళా నాయకురాలు లతా పటేల్,జె సత్య, జి సునీత,సరిత, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ గా చేస్తూనే , ఉస్మానియాలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికైన వీణవంక ఆణిముత్యం.. బొమ్మ రాజు గౌడ్..


**కరపత్రం ప్రతినిధి, వీణవంక, నవంబర్ 20.**
వీణవంక మండల కేంద్రానికి చెందిన నిరుపేద గౌడ సామాజిక వర్గానికి చెందిన బొమ్మ రాజు 2008లో సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికై, హైదరాబాద్ గోపాలపురంలో విధులు నిర్వహిస్తూనే, మరోవైపు ఉన్నత లక్ష్యం వరకు వైపు పయనిస్తూ, ఇటీవలే విడుదల చేసిన గ్రూప్– 4 ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలతో ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగాన్ని సాధించారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన బొమ్మ అశోక్( శోభన్ )– సరోజన దంపతులకు ముగ్గురు సంతానం కాగా, అందులో ప్రథమ పుత్రుడైన బొమ్మ రాజు ( 1–10) తరగతి వరకు వీణవంక సరస్వతి శిశు మందిర్ లో, ఇంటర్మీడియట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వీణవంకలో, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంట లో,పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి, 2008లో కానిస్టేబుల్ గా ఎంపికై, కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ, జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించారు. సోదరుడు ప్రశాంత్ ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉండగా, సోదరి శిరీష డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. అద్భుత



విజయాల పరంపరను కొనసాగిస్తున్న బొమ్మ రాజును మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. స్నేహితులు,గ్రామస్తులు మాట్లాడుతూ.. పల్లెటూర్లో చదువుకొని అద్భుతమైన ఆలోచన సరళితో, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కానిస్టేబుల్ గా ఎంపికై, ప్రస్తుతం ఉస్మానియాలో జూనియర్ అసిస్టెంట్ గా ఎంపిక కావడం, గ్రామంలోని యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నారని,మాకు, మా గ్రామానికి గర్వంగా ఉందని, వారి తల్లిదండ్రులను,కుటుంబ సభ్యులను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

## పోలీస్ శాఖ మీడియా సమావేశం.

**కరపత్రం ప్రతినిధి మెదక్ నర్సాపూర్.**
చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు. మీడియా సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చిన మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, నర్సాపూర్ పోలీసులు సిఐ జాన్ రెడ్డి,ఎస్సై లింగం మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం నిర్వహించారు నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ : పోలీస్ స్టేషన్ కు ఏదైనా ఫిర్యాదు వస్తే చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని అనంతరం విచారణ చేపట్టి సంబంధం ఉన్న వారిని బాధ్యులుగా, లేని వారిని తొలగిస్తామని తెలియజేశారు సీఐ.. నిన్న కొన్ని సోషల్,మీడియాలలో ప్రచురమైన చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ వార్తకు వివరణ ఇస్తూ.. కేసుకు సంబంధించి




ఫిర్యాదులో ఉన్న వ్యక్తి పాత్లోత్ విఠల్ పై కేసు నమోదు కాగా ముందే మరణించాడని మా విచారణలో తేలడంతో ఈ కేసు నుండి అట్టి వ్యక్తి పేరును కేసు నుండి తొలగించామంటూ తెలియజేశారు నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి..బైట్ : నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి...

# నాకోసం ఎవరూ మాట్లాడరు కదా!

వరుస సినిమాలతో జోరు కొనసాగిస్తున్న యువ కథానాయకుడు విష్వక్‌సేన్. ఈ ఏడాదిలో ఇప్పటికే 'గామి', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాలతో ప్రేక్షకుల్ని పలకరించారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన మరో చిత్రం 'మెకానిక్ రాకీ' ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన చిత్రమిది. 'మెకానిక్ రాకీ' ప్రయాణం, తన కెరీర్ గురించి విష్వక్‌సేన్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు."వేదికలపై ఏదో ఒకటి మాట్లాడి అందరి దృష్టిని ఆకర్షించాలనే ఆలోచన నాకు ఉండదు. ఒకొక్కసారి అలా మాట్లాడాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. అంతే కానీ, అలా మాట్లాడితేనే నా సినిమాకి ఎక్కువ ప్రారంభ వసూళ్లు వస్తాయనే భ్రమలో మాత్రం ఉండను. 'గామి' సినిమాకి రూ.10 కోట్లు ప్రారంభ వసూళ్లు వచ్చాయి. ఆ సినిమాకి ముందు నేనేమీ మాట్లాడలేదే. ఏదైనా మాట్లాడాల్సిన అవసరం వస్తే నేనే మాట్లాడాలి. ఇక్కడ నాకోసం ఎవ్వరూ మాట్లాడలేరు కదా".

**'మెకానిక్ రాకీ' పక్కా కమర్షియల్ సినిమా అనుకోవచ్చా?**

నా దృష్టిలో... ఏ సినిమాని ఎక్కువమంది చూస్తే అది కమర్షియల్ సినిమా. ఈ ట్రైలర్ చూసినప్పుడు మనం తరచూ చూసే కమర్షియల్ సినిమాలా అనిపిస్తుంది కానీ, థియేటర్లో సినిమాని చూస్తున్నప్పుడు మాత్రం తప్పుగా అర్థం చేసుకున్నామే అనుకుంటారు.



కమర్షియల్ ఫార్మాట్‌కి కొత్త అర్థం చెబుతూ, ఇదొక పాత్ బ్రేకింగ్ సినిమాగా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది.

**ఇందులో అంత ప్రత్యేకమైన అంశాలు ఏమున్నాయి?**

నాలుగైదేళ్లుగా జరుగుతున్న ఓ అంశాన్ని ఇందులో స్పృశించాం. నిజ జీవిత సంఘటనలతో రూపొందించిన చిత్రమిది. కథ విన్నప్పుడు ఇన్నాళ్లూ ఈ అంశాన్ని ఎవ్వరూ తెరపైకి తీసుకు రాలేదేమిటా అనిపించింది. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', 'మెకానిక్ రాకీ' సినిమాల్ని సమాంతరంగా చేశాం. ఈ ప్రయాణంలో మేం అనుకున్న అంశంతో వేరెవరైనా సినిమా తీస్తారో ఏమో అనే భయం వెంటాడేది. కానీ ఎవ్వరూ ఈ కథాంశంతో సినిమా చేయలేదు. మనందరం ఈ విషయానికి బాధితులమే కదా అనే భావనకి గురిచేసే కథ ఇందులో ఉంది. 60 శాతం కామెడీ, ఎవ్వరూ ఊహించని స్క్రీన్‌ప్లే... ఇలా చాలా ప్రత్యేకతలు ఉన్న సినిమా ఇది. మొత్తంగా చిన్న రిపేర్ అయితే చేశాం. ఆ రిపేర్ ఏమిటో థియేటర్లో చూసి ఆశ్చర్యపోతారు.

**కథల ఎంపికలో మీ ఆలోచనలు ఎలా ఉంటాయి? కొత్త దర్శకులతోనే ప్రయాణం సౌలభ్యంగా ఉంటుందా?**

సినిమాని ఎవరు బాగా తీస్తారనేదానికంటే, ఎవ్వరు తీయలేరో పసిగడతా. రవితేజ కథ చెప్పిన విధానం, తన రచనా శైలి, స్క్రీన్‌ప్లే చూశాక రెండో ఆలోచన లేకుండా తనతో సినిమా చేశా. కొత్త దర్శకులా, సీనియర్లా అనేది ఎప్పుడూ పట్టించుకోను. కాకపోతే నన్ను ఎంపిక చేసుకునే దర్శకులకే నా తొలి ప్రాధాన్యం. నన్ను దర్శకత్వం చేసేవాళ్లకి నేను రజనీకాంత్ అయ్యుండాలి కదా (నవ్వుతూ). దర్శకుల పనిలో విష్వక్‌సేన్ ఎప్పుడూ వేలు పెట్టడు. నేను వేలు పెట్టే అవసరం లేని సినిమాలే ఒప్పుకుంటాం. వేలు పెట్టాల్సిన అవసరమే వస్తే, నేనే రంగంలోకి దిగి దర్శకత్వం చేస్తా కానీ, వేరొకరి ఆలోచనల్ని నేనెప్పుడూ ప్రభావితం చేయను. కాకపోతే ఎవ్వరైనా సినిమాకి ముందు దర్శకుడు, నిర్మాత, ఛాయాగ్రాహకుడు, ఎడిటర్, హీరో, సంగీత దర్శకుడు కూర్చుని... ఈ సినిమా ఎలా చేస్తే బాగుంటుందో ఒకరికొకరు ఆలోచనల్ని పంచుకుని ఓ నిర్ణయానికొస్తుంటాం. అదే నేనూ చేస్తుంటాను.

**ఈ ఏడాది మూడు సినిమాలతో మీ ప్రయాణం టాప్ గేర్‌లో సాగుతోంది...**

వచ్చే ఏడాదిలో నాలుగు సినిమాలు వస్తాయి. 'లైలా' 60 శాతం పూర్తయింది. జనవరిలో అనుదీప్ దర్శకత్వంలో సినిమాతోపాటు, శ్రీధర్ గంటా - సుధాకర్ చెరుకూరి కలయికలో సినిమా మొదలవుతుంది. మార్చిలో మరో సినిమా మొదలవుతుంది. 'ఏమైంది ఈ నగరానికి 2' స్క్రిప్ట్ పనులు కూడా జరుగుతున్నాయి. సాగర్ కె.చంద్ర దర్శకత్వంలోనూ ఓ సినిమా ప్రణాళికలో ఉంది.

**సునీల్, నరేశ్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్... చాలామంది నటులే కనిపిస్తున్నారు....**

ఇది హీరో నడిపే కథ కాదు. అన్ని పాత్రలకీ సమాన ప్రాధాన్యం ఉంటుంది. సునీల్, రఘు పాత్రలు వ్యతిరేక ఛాయలతో కనిపిస్తాయి. సునీల్, నరేశ్‌లతో కలిసి నటించే సినిమాలు గుర్తుండిపోయేలా ఉండాలనేది నా ఆలోచన. ఇదివరకు చాలాసార్లు వాళ్లతో కలిసి నటించే అవకాశం వచ్చింది. కానీ ఆయా సినిమాల్లో వాళ్లకోసం డిజైన్ చేసిన పాత్రల గురించి చెప్పినప్పుడు... ఇంత చిన్న పాత్రలైతే వద్దని దర్శకులతో చెప్పేవాణ్ని. ఈ సినిమాలో బలమైన పాత్రలు కుదిరాయి. నిజంగా వాళ్లతో నటించడం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. జేక్స్ బిజోయ్ సంగీతం మరో స్థాయిలో ఉంటుంది. సినిమా చూశాక ప్రతి జిల్లా కేంద్రంలో ఓ ప్రీమియర్ షో వేయాలని నిర్ణయించాం.



## మాట మాత్రం చెప్పకుండా ఆ దర్శకుడు క్లైమాక్స్ మార్చేశాడు: 'బద్రి' నటి

'బద్రి'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన బాలీవుడ్ నటి అమీషా పటేల్. ఇటీవల ఆమె 'గదర్ 2' తో విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఆ చిత్ర దర్శకుడు అనిల్ శర్మను ఉద్దేశించి తాజాగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మాట మాత్రం చెప్పకుండా ఆయన సినిమా క్లైమాక్స్ మార్చేశారని చెప్పారు."2001లో విడుదలైన 'గదర్' భారీ విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్‌గా వచ్చిన 'గదర్ 2'పై ప్రేక్షకులకు ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. ఈక్రమంలోనే దర్శకుడు అనిల్ శర్మ క్లైమాక్స్‌ను అద్భుతంగా ప్లాన్ చేశారు. మొదట ప్రతి నాయకుడి పాత్రను సకీనానే (అమీషా పటేల్ పాత్ర పేరు) చంపాలని ఆయన తెలిపారు. అది నాకెంతో నచ్చింది. నిర్మాత కూడా దానికి అంగీకరించారు. కాని, షూట్‌కు వచ్చేసరికి అనిల్ సీన్ మార్చేశారు. ప్రతినాయకుడి పాత్రను చరణ్‌జీత్ (అనిల్ శర్మ తనయుడు ఉత్కర్ష్ శర్మ పాత్ర పేరు) చంపేలా సీన్స్ క్రియేట్ చేశారు. షూట్ జరిగేవరకూ ఆ విషయం నాక్కూడా తెలియదు. అయినప్పటికీ ఆయన అంటే నాకెంతో గౌరవం. ఆయన చేసిన పనికి ఇప్పుడు బాధపడుతుంటారు. ఏది ఏమైనా మా సినిమా బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్నందుకు ఆనందంగా ఉంది" అని అమీషా పటేల్ తెలిపారు.'గదర్ ఏక్ ప్రేమ్‌కథ'కు సీక్వెల్‌గా 'గదర్ 2' తెరకెక్కింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఇది రూపుదిద్దుకుంది. సన్నీడియోల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. గతేడాది విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. సన్నీదేవోల్, అమీషా యాక్టింగ్‌ను సినీప్రియులు మెచ్చుకున్నారు. రూ.60 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించగా.. రూ.600 కోట్లకు పైగా వసూలుచేసినట్లు సినీ విశ్లేషకులు అంచనా వేశారు. 'గదర్ 3' కూడా ఉండే అవకాశం ఉందని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 'బద్రి'లో సరయు పాత్రలో నటించిన అమీషా పటేల్ తెలుగువారికి సుపరిచితురాలు. 'నాని', 'నరసింహుడు', 'పరమవీరచక్ర' వంటి తెలుగు చిత్రాల్లోను యాక్ట్ చేశారు.



## షారుక్ ఖాన్ తనయుడి ఎంట్రీపై కంగనా రనౌత్ ప్రశంసలు

బాలీవుడ్ స్టార్ హీరో షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ రైటర్, దర్శకుడిగా ఎంట్రీ ఇస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై నటి కంగనా రనౌత్ స్పందించారు. ఆర్యన్ ఖాన్ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. మిగిలిన స్టార్ కిడ్స్‌లా నటనలోకి అడుగుపెట్టకుండా.. కెమెరా వెనక నిలబడి మెగాఫోన్ పట్టుకోవడం ప్రశంసించాల్సిన విషయం అన్నారు."సినిమా కుటుంబాలకు చెందిన పిల్లలు మేకప్ వేసుకోవడం, బరువు తగ్గడం, తమని తాము గాజుబొమ్మల్లా భావించడం.. నటీనటులుగా మారడం సాధారణంగా చూస్తుంటాం. దానిని మించి వెళ్లాలనుకోవడం నిజంగా గొప్ప విషయం. భారతీయ చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచడం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఇప్పుడెంతో ఉంది. స్టార్ కుటుంబాలకు చెందినవారు సులభమైన మార్గాన్ని ఎంచుకొని నటనలోకి వస్తుంటారు. అలాకాకుండా, కెమెరా వెనక నిలబడటానికి మనకెంతో మంది కావాలి. తక్కువమంది మాత్రమే ఆసక్తి కనబరిచే మార్గాన్ని ఆర్యన్ ఎంచుకున్నారు. రైటర్, దర్శకుడిగా అతడి తొలి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.ఆర్యన్ ఎంట్రీకి సంబంధించి ఎంతోకాలం నుంచి వార్తలు వస్తున్నాయి. దీనిపై షారుక్ కూడా పలు సందర్భాల్లో స్పందించారు. ఆర్యన్‌కు రైటింగ్‌పై ఎంతో ఆసక్తి ఉందని చెప్పారు. తన కుమారుడు రాసిన కథలను తాను అప్పుడప్పుడూ చదువుతుంటానని అన్నారు. ఈనేపథ్యంలోనే మంగళవారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఆర్యన్ తొలి ప్రాజెక్ట్ గురించి అనౌన్స్ చేసింది. "బాలీవుడ్‌లో ఇప్పటివరకూ చూడని సరికొత్త వెబ్‌సిరీస్‌ను మీకు అందించబోతున్నాం. 2025లో ఈ సిరీస్ విడుదలవుతుంది" అని తెలిపింది. 'నెట్‌ఫ్లిక్స్' 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్'సంస్థలు సంయుక్తంగా ఈ వెబ్‌సిరీస్‌ను రూపొందించనున్నాయి. తనయుడి ఎంట్రీపై షారుక్ కూడా ఆనందం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టారు. నెట్‌ఫ్లిక్స్ టీమ్‌తో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యన్ రాసిన ఉద్వేగభరితమైన కథ తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. బాలీవుడ్ నటీమణులు అలియాభట్, అనన్యపాండే, తదితరులు ఆల్‌ది బెస్ట్ చెప్పారు.చిత్ర పరిశ్రమ నేపథ్యంగా ఈ సిరీస్‌ని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. సినీ నేపథ్యం లేని వ్యక్తి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం వంటి విషయాలను ఇందులో చూపించనున్నారని టాక్. దీనికి 'స్టార్ డమ్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

